ఎవరి ఇష్టం వారిదే..

- ఆటోనగర్‌లో అస్తవ్యస్తంగా పార్కింగ్
- రాకపోకలకు అవస్థలు


ఆటోనగర్ వాసీవా కార్యాలయం వద్ద రోడ్డుపై నిలిపివేసిన లారీలు


ఆటోనగర్ మ్యాంగో పార్క్, రాజధాని కాటా మధ్య రోడ్డుపై పార్క్ చేసిన వాహనాలు


డి - బ్లాక్‌లో నిలిపిన ప్రైవేట్ వాహనాలు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ అస్తవ్యస్తంగా మారుతోంది. ప్రధాన రోడ్డు బి - బ్లాక్‌తో పాటు నిత్యం రద్దీగా ఉండే డి - బాక్‌లోని పలు పరిశ్రమలకు వచ్చే లారీలు, భారీ వాహనాలు రోజుల కొద్దీ రోడ్డుపైనే పార్క్ చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పార్కింగ్ యార్డు ఉన్నప్పటికీ లారీలకు చలానాలు చెల్లించాల్సి వస్తుందనే కారణంతో ఆయా పరిశ్రమల వద్దే రోడ్డుపైనే వాహనాలు రోజుల తరబడి నిలిపేస్తూ ఐలా ఆదాయానికి గండి కొడుతున్నారు. దీనికి తోడు పలు ప్రైవేట్ వాహనాలతో పాటు పలు కంపెనీలకు చెందిన బస్సులు ఆటోనగర్‌లో పార్క్‌చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

పలు రాష్ట్రాలతో పాటు జిల్లాల నుంచి ఆటోనగర్‌కు కావాల్సిన ముడి సరకులు తీసుకువచ్చే లారీలు, ఆటోనగర్‌లో తయారైన పలు వస్తువులను ఇతర ప్రాంతాలకు తరలించే లారీల రాకపోకలతో ఆటోనగర్ గజిబిజిగా ఉంటుంది. ఒకవైపు రోడ్లు భారీ గోతులతో ప్రమాదకరంగా మారాయి. దీనికి తోడు అవే రోడ్లపై భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండడం, అయినా ఐలా అధికారులు, సిబ్బంది పట్టించుకోక పోవడం నిర్లక్ష్యానికి పరాకాష్ట అని వాహనచోదకులు అంటున్నారు.

ప్రధాన మార్గంలోనూ..

ఆటోనగర్ ఎఫ్, ఈ, ఎపెరల్‌పార్క్, గ్రీన్ సిటీ, వడ్లపూడి, ఫకీర్‌తక్యా, యాదవజగ్గరాజుపేట, అగనంపూడి, కూర్మన్నపాలెం తదితర ప్రాంతాల నుంచి గాజువాక, పోర్టు రోడ్డు వంటి ప్రాంతాలకు కార్మికులు, ఇతర అవసరాలకు వచ్చేవారికి ఆటోనగర్ బి - రోడ్డే ప్రధాన మార్గం. ఈ బ్లాక్‌లో పలు వాహనాల సర్వీసింగ్ సెంటర్లు, కొరియర్ సర్వీసు గొడౌన్లు, ప్రైవేట్ బ్యాంకులు ఉన్నాయి. ఇక్కడికి వస్తున్న వారు వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఐలా అధికారులు స్పందించి ఆటోనగర్‌లోని బి, డీ బ్లాక్ రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


బి - బ్లాక్ ప్రధాన రోడ్డులో పార్క్ చేసిన లారీలు

రోడ్డుపై పార్కింగ్‌తో ఇబ్బందులు

గాజువాకలోని ఓ వ్యాపార సముదాయంలో పనిచేస్తున్నా. నిత్యం చట్టివాని పాలెం రైల్వే గేటు దాటి బి - బ్లాక్ రోడ్డు నుంచి రాకపోకలు సాగిస్తున్నా. రోడ్డుపైనే భారీ వాహనాల పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు పూర్తిగా భారీ గోతులతో ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు పట్టించుకోవాలి.

అప్పారావు, వడ్లపూడి

అనధికార పార్కింగ్‌పై చర్యలు



ఆటోనగర్‌లోని పలు బ్లాక్‌లకు వచ్చే భారీ, అతి భారీ వాహనాలు రోడ్లపైనే రోజుల తరబడి పార్కింగ్ చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. పార్కింగ్ కాంట్రాక్టర్ దీనిపై దృష్టిసారించి చలానాలు రాయాలి. ఐలా పెట్రోలింగ్ వాహనాల ద్వారా రోడ్లపై పార్కింగ్ చేస్తున్న లారీలను పార్కింగ్ యార్డుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. పరిశ్రమలకు వచ్చే వాహనాలు తప్పని సరిగా పార్కింగ్ యార్డులో పార్కింగ్ చేయాలి.

జయచంద్ర, ఆటోనగర్ ఐలా కమిషనర్

క్లుప్తంగా

పీసీవోఎస్‌పై అప్రమత్తంగా ఉండాలి


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వైద్యురాలు సునీత

ఉక్కునగరం: పోలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్)పై బాలికలు అప్రమత్తంగా ఉండాలని స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి గైనికాలజిస్ట్ డాక్టర్ సునీత అన్నారు. పీసీవోఎస్ అవగాహన మాసంలో భాగంగా బుధవారం ఉక్కు సృష్టి వరల్డ్ పాఠశాలలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు నిత్యం వ్యాయామం చేయాలన్నారు. ఈ సందర్భంగా పీసీవోఎస్, దాని వల్ల కలిగే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించారు. పాఠశాల డైరెక్టర్ పి. సుశీలారాణి, ప్రిన్సిపాల్ కిరణ్ దేవగిరి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ


నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని పెద మడక, కొండయ్యవలస, బీసీ కాలనీ, కణింకోట ప్రాంతాల్లో నివాసముంటున్న నాలుగు కుటుంబాలకు సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా బియ్యం, పప్పులు, నూనెలు, ఇతర వంట సామగ్రి అందించారు. సీడబ్ల్యూసీ కార్యదర్శి కరణం పైడిరాజు మాట్లాడుతూ సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఔదార్యం ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, ఎ.గోవింద్, పి.కొండలరావు, కె.హనుమంతురావు, లక్కరాజు రాము పాల్గొన్నారు.

పోలీస్ సైంటిస్ట్ డాక్టర్ ప్రసాదరావు


శీలానగర్‌లో మొక్క నాటుతున్న ప్రభాకరరావు తదితరులు

అక్కిరెడ్డిపాలెం: మాజీ డీజీపీ డాక్టర్ బయ్యవరపు ప్రసాదరావు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. యాక్ట్ (అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్) వ్యవస్థాపకుడు ఆళ్లమూడి ప్రభాకరరావు ఆధ్వర్యంలో శీలానగర్ ట్రాఫిక్ స్టేచ్ మేనేజ్‌మెంట్ కార్యాలయం వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. పోలీస్ సైంటిస్ట్‌గా ప్రసాదరావు పేరొందారని నాయకులు కొనియాడారు. గాజువాక నుంచి ఎయిర్ పోర్టు వరకు, విశాఖపట్నం పోర్టు జంక్షన్ వద్ద కూడా మొక్కలు నాటారు. కార్యక్రమంలో యాక్ట్ ప్రతినిధులు పి.భీమారావు, పి.ఎం.ఎం.వెంకటరావు, కార్తీక్, శ్రీనివాసరావు, మధుబాబు, అప్పారావు పాల్గొన్నారు.

సావిత్రి బాయి పూలే విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంఈవోలు, దాతలు, ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: సావిత్రి బాయి పూలే సేవలు మరువలేమని మండల విద్యా శాఖాధికారులు ఇ.శ్రీనివాసరావు, కె.రమణాజీ అన్నారు. ఎండీ సాహెబ్‌పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రి బాయి పూలే విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. విగ్రహ దాతలు ప్రకాశ్‌రావు, ఆంజనేయులు, దాసరి అప్పలరాజు, నూకరత్నంలను అభినందించారు.

వ్యాధుల కట్టడికి ప్రత్యేక చర్యలు

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


పీహెచ్‌సీ వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. అక్కిరెడ్డిపాలెం, సిద్ధేశ్వరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అక్కిరెడ్డిపాలెం ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను, మలేరియా, డెంగ్యూ, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితాను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య సిబ్బంది అంతా ఎఫ్ఆర్ఎస్ హాజరు విధిగా వేయాలని, లీవ్ రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్ తప్పని సరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సూపర్‌వైజర్లు రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి ఐరన్ మాత్రలు అందించాలన్నారు. సిసెక్షన్ ప్రసవాలు నివారించాలని, ముఖ్యంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ శత శాతం పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం కాబట్టి కీటక జనిత వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఉమాపతి, డీపీఎంవో బి.నాగేశ్వరరావు, పట్టణ కేంద్ర ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంకట మోచన గణపతికి క్షీరాభిషేకం


సంకటమోచన గణపతి ఉత్సవ మూర్తికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుద్ధాష్టమిని పురస్కరించుకొని జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో స్వామి వారికి బుధవారం విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తికి భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అన్నసమారాధనలు


అన్న సమారాధన పాల్గొన్న కోమటి శ్రీనివాసరావు తదితరులు


వడ్డన చేస్తున్న గోవింద్ తదితరులు


భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న పైడిరెడ్డి తదితరులు

అగనంపూడి: వినాయ చవితి ఉత్సవాల సందర్భంగా 87వ వార్డు వడ్లపూడి గణేష్‌నగర్, కణితి ర్యాసితకాలనీ క్షత్రియ వీధి, శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా మండపాల్లో ఏర్పాటు చేసిన గణపతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో జెర్రిపోతుల ఈశ్వర రావు, దాసరి శివ, మింది రాజు, కుమార్, సేనాపతి సింహాచలం, కొమరపు చిన్నబాబు, కట్టా రామారావు, కోసూరి అప్పలసూరి, ముత్యాలు, అల్లం ప్రభావతి,మీనా, భారతి పాల్గొన్నారు.

సమారాధన

వడ్లపూడి కణితి నిర్వాసితకాలనీలో గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనను వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవిందలు ప్రారంభించారు. కార్యక్రమంలో బొండా గోవిందరాజులు, ఈశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెంలో బట్టు వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండం వద్ద బుధవారం రాత్రి భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు బట్టు పైడిరెడ్డి ప్రారంభించారు. నాయకులు బట్టు అప్పలరెడ్డి, బట్టు ప్రకాష్, సతీష్, పిట్ట వెంకటరెడ్డి, పిట్టి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూ ఐటీఐలోని డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఉండాలని, అభ్యర్థుల వయసు 18 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, అభ్యర్థుల హెవీ వెహికల్ డ్రైవింగ్ ఎల్ఎల్ ఆర్ కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు ఈ నెల 23లో గా ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9491962841 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వీరవనిత చాకలి ఐలమ్మ


చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఉక్కునగరం: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని సీఐటీయూ నాయకుడు ఎం. కృష్ణారావు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కేవీపీఎస్ స్టీల్ డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూస్వాములను తరిమికొట్టిన చరిత్ర ఐలమ్మది అన్నారు. తద్వారా సాయుధ పోరాటం జరిగి తెలంగాణలో 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ జరిగిందన్నారు. కేవీపీఎస్ గౌరవ అధ్యక్షుడు వై.టి. దాస్, ప్రధానకార్యదర్శి ఎస్. సత్యనారాయణ టి. చిరంజీవి, కె. గంగాధర్, ఎస్. శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: పెదగంట్యాడ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గొడ్డువానిపాలెం, దుర్గవాని పాలెం, నెల్లిముక్కు, సీతానగరం, పెదగంట్యా డ మెయిన్ రోడ్డు, బర్మా కాలనీ, బాబూ జగ్జీవన్‌రామ్‌నగర్, రైతుబజార్ ఏరియా, ఎస్సీ కాలనీ, అర ఏరియా తదితర ప్రాంతాల్లో శుక్ర వారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చినగంట్యాడ పరిధిలో..

గాజువాక: చినగంట్యాడ, సెలెస్ట్ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా ఎస్సీ కాలనీ, కోర్టు ఏరియా, చినగంట్యాడ ఏరియా, శ్రామికనగర్, డ్రైవర్స్ కాలనీ, ఎల్‌బీఎస్ నగర్, కుంచుమాంబ కాలనీ, ఎర్రగెడ్డ కాలనీ, దత్తసాయినగర్, చైతన్యనగర్, సెలెస్ట్ అపార్ట్‌మెంట్స్, స్నేహపురి కాలనీలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కణితి, బీహెచ్‌పీవీ పరిధిలో..

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ కణితి రోడ్డు ఫీడర్, 33/11 కేవీ బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్, 11 కేవీ జీఏ కాలనీ ఫీడర్, 11 కేవీ మింది ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ - 2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతగాజువాక పార్ట్ 1, పంతులుగారి మేడ, చిట్టినాయుడు కాలనీ, పద్మజ హాస్పటల్, దశమికొండ, జీఏ కాలనీ, కాళికా నగర్, మింది జీవీఎంసీ వాటర్ వర్క్స్, మింది ఏ - బ్లాక్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమానికి సరకుల అందజేత


వృద్ధాశ్రమ నిర్వాహకురాలికి పాదపూజ చేస్తున్న జేసీఐ ప్రతినిధులు

ఉక్కునగరం: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) వైజాగ్ స్టీల్‌సిటీ ఆధ్వర్యంలో వృద్ధులకు సాయం చేశారు. జేసీఐ వారోత్సవాల్లో భాగంగా ప్రతినిధులు బుధవారం చీడికాడ మండలం అప్పలరాజుపురంలోని లలితాదేవి వృద్ధాశ్రమానికి నిత్యావసర సరకులు, కూరగాయలు, పండ్లు అందజేశారు. అక్కడ పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆటపాటలతో వారితో సరదాగా గడిపారు. వృద్ధులకు సేవ చేస్తున్న వారికి పాదపూజ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వై. వెంకటలక్ష్మి, భవాని, జేసీఐ ప్రెసిడెంట్ ధనంజయ్, నిర్వాహకురాలు రమ, సరోజిని, సీనియర్ మెంబర్స్ రవికుమార్, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

అగనంపూడి: మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వీఎస్ఈజెడ్‌లోని లీ ఫార్మా కంపెనీ డైరెక్టర్ లీలారాణి అన్నారు. కూర్మన్నపాలెంలోని ఓ పాఠశాలలో బుధవారం మొక్కలు నాటారు. పౌష్టికాహారం, వాటి ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ అధికారి రాధికకు సత్కారం


హెచ్‌ఆర్ అధికారి రాధికను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ డీజీఎం డాక్టర్ దాసరి రాధికను వివిధ సంఘాల నాయకులు సత్కరించారు. నేషనల్ స్టీల్ అసోసియేషన్ ఇటీవల ఆమెకు న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మక జెండర్ డైవర్సిటీ అవార్డు అందజేసింది. ఈ సందర్భంగా బుధవారం నాయకులు ఆమెను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌ఆర్ అధికారిగా డాక్టర్ రాధిక అందించిన సేవలకు గుర్తింపుగా జాతీయ స్థాయి జెండర్ డైవర్సిటీ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాద్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో విభాగం జీఎం డాక్టర్ పి. రవికుమార్, వివిధ సంఘాలు, అసోసియేషన్ల నాయకులు కారు రమణ, బయ్యే మల్లయ్య, బి. తాడన్న, ఎస్. సత్యనారాయణ, అప్పలరాజు, టి. కనకరాజు, త్రిలోకనాథ్, కె.వి. రత్నం, శేషకుమార్, రాథోడ్, మోహన్‌బాబు పాల్గొన్నారు.

ఉక్కును కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే


దీక్షా శిబిరంలో పాల్గొన్న నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు మాటూరి శ్రీనివాసరావు, బి.అప్పారావు, శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షా శిబిరంలో బుధవారం వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఉక్కును కాపాడుతామని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని, ఆ వాగ్దానాలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. విశాఖలోని లక్షల కోట్ల విలువైన భూములపై అదాని, అంబానీలు కన్నేశారని, కేంద్ర ప్రభుత్వసహకారంతో వాటిని కొట్టేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించకపోతే ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో వరసాల శ్రీనివాసరావు, అప్పారావు, కోరాడ వెంకటరావు, కామేశ్వరరావు, వైఎల్‌నాయుడు, కనకరాజు, వి.అప్పలరాజు, కె.పెంటారావు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పును పునః సమీక్షించాలి


తహసీల్దార్ శ్రీవల్లికి వినతిపత్రం అందిస్తున్న పోరాట కమిటీ నాయకులు

అగనంపూడి: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు న్యాయబద్ధంగా లేదని, ఈ విషయంలో పునరాలోచించాలని కోరుతూ మాలమహానాడు ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ తీర్పు సహేతుకంగా లేదని, ఈవిషయంలో సుప్రీం కోర్టు ధర్మాసనం పునః సమీక్షించాలని నాయకులు కెబీఆర్ అంబేడ్కర్, మాటూరి శ్రీనివాసరావు, పాల్తేటి పెంటారావు కోరారు. అనంతరం గాజువాక తహసీల్దార్ శ్రీవల్లికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బలిరెడ్డి నాగేశ్వరరావు, గాలి ఆనంద్, డాక్టర్ ప్రకాష్ రత్నం, పట్నాలరాజు, బీఏస్వామి, సమ్మంగి కొండలరావు, నరవ రమణ, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని వినతి


కేంద్ర ఈపీఎఫ్‌వో అదనపు కమిషనర్ గుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. బుధవారం ఆయన న్యూఢిల్లీలో అదనపు కేంద్ర పీఎఫ్ కమిషనర్ ఎస్.కె. గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. హయ్యర్ పెన్షన్ కోసం వచ్చిన నోటీసుల మేరకు సుమారు రూ. 400 కోట్లు ఈపీఎఫ్‌వోకు చెల్లించినట్టు వివరించారు. అయినప్పటికీ ఏ ఒక్కరికీ హయ్యర్ పెన్షన్ అమలు కావడం లేదన్నారు. ఒకవైపు వారి నుంచి లక్షలాది రూపాయలు చెల్లించినప్పటికి హయ్యర్ పెన్షన్ అమలు కాకపోవడం వల్ల వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్టీల్ ఇంటక్ నాయకులు బి.ఎస్. రాజు పాల్గొన్నారు.

ఉక్కు పోరాటానికి కాంగ్రెస్ నేతల సంఘీభావం


ఉక్కు కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న గాజువాక కాంగ్రెస్ పార్టీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే యోచనను కేంద్రం విరమించుకోవాలని గాజువాక కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గాజువాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం భెల్ ఇంటక్ కార్యాలయంలో బుధవారం జరిగింది. సమావేశంలో నాయకులు ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సంఘీభావం ప్రకటించారు. పీసీసీ కార్యవర్గంలో నియోజకవర్గం నుంచి చోటు కల్పించకపోవడంపై నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినా పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. గవర వెంకటరమణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు ఉరుకుటిటి అచ్చిబాబు, మాచిపాడు స్వర్ణ, కొవిరి దేముడు, పల్లెల శ్రీనివాసరావు, చట్టి సింహాచలం, పి.ఎల్.ఎస్.గుప్తా, రంజితా రెడ్డి, పెద్దాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.